# పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన 2023 ఫిబ్రవరి 7 నుంచి 9 వరకూ గుజరాత్‌లోని రాన్ ఆఫ్ కచ్‌లో జి-20 పర్యాటక కార్యాచరణ బృందం తొలి సమావేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:జి-20 చట్రం కింద తన పరిధిలోని పర్యాటక కార్యాచరణ బృందం తొలి సమావేశాన్ని 2023 ఫిబ్రవరి 7 నుంచి 9 వరకూ గుజరాత్‌లోని రాన్ ఆఫ్ కచ్‌లో కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ నిర్వహించనుంది. దీనికి సంబంధించిన వివరాలను ఆ శాఖ కార్యదర్శి శ్రీ అరవింద్ సింగ్ న్యూఢిల్లీలో ఇవాళ విలేకరులకు వెల్లడించారు.

భారత జి-20 అధ్యక్షత కాలంలో పర్యాటక రంగానికి సంబంధించి 5 అంతర్గత ప్రాధాన్య రంగాలున్నాయని ఆయన తెలిపారు. తదనుగుణంగా "పర్యాటక రంగాన్ని పచ్చగా మార్చడం, డిజిటల్ శక్తి వినియోగం, యువతకు నైపుణ్య సాధికారత కల్పన, పర్యాటక 'ఎంఎస్ఎంఇ'/అంకుర సంస్థల సంరక్షణ, పర్యాటక గమ్యాల వ్యూహాత్మక నిర్వహణపై పునరాలోచన" వగైరాలపై నిశితంగా దృష్టి కేంద్రీకరిస్తామని ఆయన విశదీకరించారు. ఇందులో భాగంగా కార్యాచరణ బృందం తొలి సమావేశంలో పర్యాటకాన్ని ప్రోత్సహించే దిశగా గ్రామీణ-పురావస్తు పర్యాటకంపై అనుబంధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అదే సమయంలో విదేశీ ప్రతినిధులకు భారతీయ పర్యాటక విజయగాథలను ప్రదర్శిస్తామని చెప్పారు.

సుస్థిర ప్రగతి లక్ష్యాలను 2030 నాటికల్లా సాధించే మార్గాలపై ఏకాభిప్రాయ సాధన జి-20 వేదికకుగల ప్రాథమ్యాలలో ఒకటని కార్యదర్శి వెల్లడించారు. ఆ మేరకు పర్యావరణానికి మాత్రమేగాక స్థానిక వ్యాపార సంస్థలకు అవకాశాల సృష్టికీ కీలకమైన సుస్థిర పర్యాటకానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. భారత పర్యాటక సామర్థ్యంపై ప్రపంచ స్థాయిలో అవగాహన పెంచడానికి జి-20 దోహదం చేస్తుందని శ్రీ అరవింద్ సింగ్ పేర్కొన్నారు. తదనుగుణంగా సమావేశాలకు హాజరయ్యే విదేశీ ప్రతినిధులకు భారతీయ సంస్కృతిని తెలిపేలా పర్యాటక ప్రదేశాల సందర్శన ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో భాగంగా రాన్ ఆఫ్ కచ్ సమావేశం సందర్భంగా వారిని యునెస్కో ప్రపంచ వారసత్వ పర్యాటక ప్రదేశం ధోలావీరకు తీసుకెళ్తామని తెలిపారు. తద్వారా మన దేశ పౌరులే కాకుండా విదేశీ ప్రజలు ఇలాంటి ప్రదేశాల గురించి తెలుసుకుంటారని, దీనివల్ల పర్యాటక రంగ ప్రగతికి ఉత్తేజం లభిస్తుందని పేర్కొన్నారు.

స్థానిక ప్రజల్లో? ముఖ్యంగా పర్యాటక తాకిడిని నిభాయించగల యువతరంలో ఆతిథ్య-నిర్వహణ నైపుణ్యాలను మెరుగుపరచడం కూడా కార్యాచరణలో ఒక భాగమని కార్యదర్శి తెలిపారు. కేంద్ర బడ్జెట్ 2023-24లోని ముఖ్యాంశాలలో కూడా ఇదొక ప్రాధాన్యం కావడం గమనార్హం. ప్రతినిధుల సమక్షంలో స్థానిక కళా-హస్తకళల ప్రత్యక్ష ప్రదర్శనలు ఉంటాయని, అలాగే ఒక జిల్లా-ఒక ఉత్పత్తి కార్యక్రమం కింద వారికి వీడ్కోలు బహుమతులు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. శ్రీ అరవింద్ సింగ్ మరికొన్ని వివరాలు తెలుపుతూ- భారత జి-20 అధ్యక్షతను సద్వినియోగం చేసుకుంటూ 3 పర్యాటక సంబంధ భారీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ మేరకు జి-20 సంబంధిత కార్యక్రమాలతోపాటు ఏప్రిల్‌లో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు, 'ఎంఐసిఇ' సదస్సు, ప్రపంచ పర్యాటక సీఈవోల వేదిక సమావేశం నిర్వహిస్తామని వివరించారు.

జి-20 శిఖరాగ్ర సదస్సు ముగింపు సందర్భంగా- దానికిముందు జరిగే సమావేశాల్లో వివిధ దేశాలు ఆమోదించిన మంత్రుల స్థాయి దిశానిర్దేశ తీర్మానాన్ని సమర్పిస్తామని శ్రీ అరవింద్ సింగ్ తెలిపారు. జి-20 కార్యక్రమాల కోసం ఎంచుకున్న వివిధ ప్రదేశాలు గ్రామీణ, పురావస్తు, చారిత్రక వగైరా విభిన్న ఆకర్షణీయాంశాలతో కూడినవై ఉంటాయి.

# అసెంబ్లీలో నోరేసుకొని అరిస్తే సరిపోదు..

## -కేటీఆర్ వర్సెస్ అక్బరుద్దీన్ ఫైట్

హైదరాబాద్, ఫిబ్రవరి 4:తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా మాటల మంటలు చెలరేగాయి. అధికార బీఆర్ఎస్ కు సన్నిహితంగా ఉండే ఎంఐఎంనే విరుచుకుపడడం విశేషం. ఎంఐఎం నేత అక్బరుద్దీన్ అసెంబ్లీలో కేసీఆర్ సర్కార్ పై నిప్పులు చెరిగారు. అసెంబ్లీకి రాని నేతలకు సీఎం కేసీఆర్ అపాయింట్మెంట్ ఇవ్వడం లేదని ఇది సరికాదని ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. అసెంబ్లీలో గవర్నర్కు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఆయన మాట్లాడారు.

పాతబస్తీలో మెట్రో రైలు ఏమైందని ప్రశ్నించారు. పాతబస్తీకి చేసిన వాగ్దానాలేంటి అని ప్రశ్నించారు. ఉస్మానియా లాంటి పాత ఆసుపత్రుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. టీఆర్ఎస్ను పక్కన పెట్టాల్సిన అవసరం బీఆర్ఎస్కు ఎక్కడిదని ప్రశ్నించారు. గవర్నర్ ప్రసంగంలో అసలు పవిత్రత ఏంటని అక్బర్ ప్రశ్నించారు. తెలంగాణపై సవతి తల్లి వైఖరి ఎందుకు చర్చకు రావడం లేదు? అని నిప్పులు చెరిగారు.గవర్నర్ ప్రసంగానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందా? అంటూ ప్రశ్నించారు. నగరంలో ఇప్పుడు సగం సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయని వివరించారు. మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అక్బరుద్దీన్ డిమాండ్ చేశారు.అక్బర్ ప్రసంగం చేస్తున్న తీరుపై మంత్రి కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తగినంత సమయం ఉందని అదే విధంగా వేరే పద్ధతిలో పెట్టవచ్చని ఆయన అన్నారు. గట్టిగా అరవడం వల్ల పరిస్థితి మారదని కేటీఆర్ హెచ్చరించారు. 7 మంది సభ్యుల ఎంఐఎం పార్టీకి చాలా సమయం ఇస్తున్నామని కేటీఆర్ సెటైర్ వేశారు. అక్బర్ అసెంబ్లీలో బుల్ డోజింగ్ చేసిన తీరుపై కూడా మంత్రి ప్రశాంత్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.సీఎం కేసీఆర్ ఇంట్లో ఉండాల్సిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గా రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆయన చెప్పిన ఐటీ దాడుల దృష్ట్యా నగరంలో ఏం జరుగుతుందో తెలియడం లేదు. రాష్ట్రం పోలీసులను ఉపయోగిస్తోందని కేంద్రం ఐటీ శాఖను ఉపయోగించుకుంటోందని అన్నారు. మేఘకృష్ణారెడ్డిపై ఎందుకు దాడులు చేయడం లేదని జగ్గారెడ్డి ప్రశ్నించారు.ఇలా అసెంబ్లీలో రెండోరోజు వాడీవేడిగా చర్చ సాగింది. నువ్వా నేనా? అన్నట్టుగా నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం గట్టిగానే కౌంటర్ ఇచ్చింది.

# మెల్‌బోర్న్‌లో కన్నుల పండువగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం



హైదరాబాద్, ఫిబ్రవరి 4: తెలుగు కల్చరల్ అసోసిషన్ వారి ఆధ్వర్యంలో శనివారం మెల్‌బోర్న్‌లో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి కల్యాణమహోత్సవం శ్రీ రాఘవేంద్ర మఠం మురాంబీన్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణంలో మెల్‌బోర్న్‌వాసులతో పాటు తెలుగు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా యాదాద్రి ఆలయ ఈవో గీతా కార్యక్రమానికి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ వహించి యాదాద్రి ఆలయ పునర్నిర్మాణము అత్యద్భుతంగా జరిగిందని వెల్లడించారు. తెలుగువారు స్వదేశానికి వచ్చిన సందర్భంగా యాదాద్రి స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు. అనంతరం మెల్‌బోర్న్‌లో కల్యాణం ఏర్పాటు చేసిన ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ ఆఫ్ విక్టోరియా వారికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# కల్యాణానికి ముస్తాబైన గోవిందరాజుల స్వామి ఆలయం...



## -నేడు స్వామివారి కల్యాణం

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 4: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని ప్రహ్లాద పర్వతంపై వెలసిన శ్రీ గోవిందరాజ స్వామి కళ్యాణం ఆదివారం వైభవంగా జరగనుంది. కళ్యాణానికి స్వామి వారిని ముస్తాబు చేశారు. ప్రతి సంవత్సరం పౌర్ణమి రోజున స్వామివారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ నిర్మాణ దాత. కమిటీ శాశ్వత చైర్మన్ ఉప్పు గంటి గోవిందరావు- శోభలత ఆధ్వర్యంలో కల్యాణ తంతు నిర్వహించనున్నారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. స్వామివారి కల్యాణానికి గ్రామస్తులు కాకుండా చుట్టు ప్రక్కల నుండి పెద్ద ఎత్తున భక్తులు హాజరు కానున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గ్రామస్తుల సహకారంతో ఏర్పాట్లు జరుగుతున్నాయి. కోరిన కోర్కెలు తీర్చే గోవిందరాజుల స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రహ్లాద పర్వతంపై వెలిసిన గోవిందరాజుల స్వామి ఆలయం భక్తులను ఎంతగానో ఆకర్షిస్తుంది,

# కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి..!

**-18 ఏండ్లు పైబడిన ప్రతి ఒక్కరు కంటి వెలుగు శిబిరాలలో కంటి పరీక్షలు చేయించుకోవాలి.**

**-జిల్లాలో 69 బృందాలతో కంటి పరీక్షల నిర్వహణ .**

**-ఇప్పటి వరకు 1,59,053 మందికి కంటి పరీక్షలు పూర్తి.**

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ .**



సంగారెడ్డి, ఫిబ్రవరి 04(నేటి నిజం ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ శనివారం నాడు ఒక ప్రకటనలో సూచించారు.

కంటి వెలుగుకార్యక్రమములో 18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన 17,11,685 మందికి కంటి పరీక్షల నిర్వహణ లక్ష్యంగా 69 బృందాలతో జనవరి 19 నుండి సోమవారం నుండి శుక్రవారం వరకు(ప్రభుత్వ సెలవు దినాలు మినహా) ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు కంటి వెలుగు శిబిరాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

కంటి వెలుగు రెండో విడత లో భాగంగా ఇప్పటి వరకు (ఫిబ్రవరి,3 నాటికి) జిల్లాలో 1,59,053 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు.అందులో 83,448 మంది మహిళలకు,75,469 మంది పురుషులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు.

ఇట్టి శిబిరాల్లో ఇప్పటివరకు 22,274 మందికి రీడింగ్ గ్లాసెస్ ఇవ్వడం జరిగిందని,17,600 మందికి ప్రిస్క్రైబ్డ్ అద్దాలు అవసరమని గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రిస్క్రిబ్ అద్దాలను వెంటనే ఆర్డర్ చేస్తున్నామని, సంబంధితులకు కంటి అద్దాలు రాగానే అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. 1,19,179 మందికి ఏలాంటి కంటి సమస్యలు లేనట్లు గుర్తించారని తెలిపారు.

జిల్లాలో ఇప్పటి వరకు 41 గ్రామ పంచాయతీ లలో,మున్సిపాలిటీలలోని 17 వార్డులలో పూర్తి స్థాయిలో కంటి పరీక్షలు పూర్తయినట్లు పేర్కొన్నారు.

క్యాంపులు నిర్వహించే ప్రదేశాలకు సంబంధించి ఏ రోజు, ఏ గ్రామంలో,ఆయా మున్సిపాలిటీ లలో ఏ వార్డులలో నిర్వహిస్తున్న విషయాన్ని ముందస్తుగా తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

శిబిరంలో అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు ఉచితంగా ఇస్తారని తెలిపారు. కంటికి సంబంధించి ఏ సమస్యలున్నా నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

18 సంవత్సరాలు పైబడిన వారందరూ కంటి వెలుగు శిబిరాలలో కంటి పరీక్షలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

అందరి భాగస్వామ్యంతో కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# సచివాలయంలో అగ్నిప్రమాదం కేసీఆర్కు అపశకునం?

హైదరాబాద్, ఫిబ్రవరి 4:ఫిబ్రవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కొత్త సెక్రటేరియట్ నిర్మాణంలో ఏర్పడిన అగ్ని ప్రమాదంపై రాష్ట్రంలో హాట్ టాపిక్ అయింది. ఇక్కడున్న వాస్తవాలు ప్రజలకు తెలిపేందుకు తాము భవనంలోకి వెళ్తామని కాంగ్రెస్ నాయకులు రెడీ అయ్యారు. కానీ సెక్యూరిటీ సిబ్బంది అనుమతి ఇవ్వలేదు. మరోవైపు మంత్రి పోలీసులు ఈ ప్రమాదంపై చేసిన ప్రకటనలు భిన్నంగా ఉన్నాయి. ఇది స్వల్ప ప్రమాదమేనని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అంటుండగా.. పోలీసులు మాత్రం మాక్ డ్రిల్ అని అనుంటున్నారు. ఇక మొదటి అంతస్తులో మాక్ డ్రిల్ నిర్వహించామని పోలీసులు చెబుతుండగా.. 5వ అంతస్తులో ప్రమాదం జరిగిందని ఇది శుభపరిమాణమేనని మంత్రి చెప్పడం గమనార్హం.

అయితే శుక్రవారం జరిగిన ప్రమాదంతో గుమ్మటంపై దట్టమైన పొగలు వ్యాపించాయి. 11 ఫైరింజన్లతో మంటలను ఆర్పేశారు. ఈ నేపథ్యంలో అసలు అగ్నిప్రమాదం జరిగిందా..? లేక ఉద్దేశపూర్వకమా? అనేది సస్పెన్స్ గా మారింది. మరోవైపు అసలు ఈ నిజాన్ని ఎందుకు దాచేస్తున్నారని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నారు.

ఈనెల 17న కొత్త సెక్రటేరియట్ ను ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అదే రోజు సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు జార్ఖండ్ సీఎంలు బీహార్ డిప్యూటీ సీఎంలను ఆహ్వానించడంతో వారు సానుకూలంగా స్పందించారు. వీరితో పాటు కొందరు జాతీయ నాయకులను కూడా ఆహ్వానించి అంగరంగ వైభవంగా ప్రారంభించాలని చూస్తున్నారు.

ఈ నేపథ్యంలో సచివాలయంలో పెండింగులో ఉన్న పనులు 17లోగా పూర్తి చేయాలని మంత్రులు కాంట్రాక్టర్లను ఆదేశిస్తూ వస్తున్నారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఈ పనులను దగ్గరుండి మరీ పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల కేసీఆర్ సైతం నాలుగు గంటల పాటు సచివాలయ నిర్మాణ పనులను పరిశీలించారు.

ఈ తరుణంలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరగడం చర్చనీయాంశంగా మారింది. సచివాలయం మొదటి అంతస్తులో వుడ్ వర్క్ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం సంబవించిందని తెలుస్తోంది. కానీ ఈ విషయాన్ని బయటకు రాకుండా ప్రభుత్వం జాగ్రత్త పడింది. సచివాలయం గమ్మటంపై దట్టమైన పొగలు రావడంతో భవనంలోకి ఎంట్రీ ఇచ్చేందుకు మీడియా ప్రయత్నించింది. కానీ అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది అనుమతించలేదు.

అయితే ఈ ప్రమాద విషయంలో మీడియాలో రావడంతో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్పందించారు. ఇది స్వల్ప ప్రమాదమేనని అన్నారు. మరోవైపు ఇలా ప్రమాదం జరగడంతో దిష్టిపోయిందని ఈ ప్రమాదం శుభ పరిణామమేనని అనడం ఆసక్తిగా మారింది.

కానీ పోలీసులు మాత్రం ఇది మాక్ డ్రిల్ అని అంటున్నారు. ముందు జాగ్రత్తగా మాక్ డ్రిల్ నిర్వహించామని ఇది ప్రమాదం కాదని అంటున్నారు. ఈ ప్రమాదంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మాట్లాడుతూ సచివాలయం కు అంబేద్కర్ పేరు పెట్టి ఆయన పుట్టిన రోజున ప్రారంభించాలని అన్నారు.

కేసీఆర్ పుట్టిన రోజు అని చెప్పి నాణ్యత లేని పనులు నిర్వహిస్తున్నారని అందుకనే అగ్ని ప్రమాదం సంభవించిందని విమర్శించారు. ఇక కాంగ్రెస్ చీఫ్ రేవంత్ రెడ్డి నాయకులతో కలిసి భవనంలోకి వెళ్లడానికి యత్నించారు. కాని అనుమతి ఇవ్వలేదు. ఒకటి రెండు రోజుల్లో కేసీఆర్ పరిశీలించి అసలు విషయం తెలుసుకోనున్నారు.

సెక్రటేరియట్ కాంప్లెక్స్ లోపల సరిగ్గా ఏమి జరిగిందో ఎవరికీ తెలియదు మరియు అధికారులు మొత్తం వ్యవహారాలను మూసివేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది కేవలం మాక్ డ్రిల్ అని బీఆర్ఎస్ నాయకులు మొదట్లో ఈ సంఘటనను తక్కువ చేయడానికి ప్రయత్నించారు అయితే మంటలను ఆర్పడానికి 11 ఫైర్ టెండర్లు సంఘటనా స్థలానికి ఎందుకు తరలించాయో వారు వివరణ ఇవ్వలేదు.

ఇది కేవలం మాక్ డ్రిల్ అయితే ప్రభుత్వం ఆ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేసి ఉండాల్సింది. కానీ వారు చేయలేదు. వాస్తవానికి అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ వై నాగి రెడ్డి మరియు ఇతర సీనియర్ అధికారులు మొత్తం అగ్నిమాపక చర్యను పర్యవేక్షించారు వారు మీడియాకు ఎటువంటి వివరాలను వెల్లడించడానికి నిరాకరించారు.

ఆ ప్రాంతమంతా పోలీసులు చుట్టుముట్టి మంటలను ఆర్పే వరకు సచివాలయంలోకి ఎవరినీ అనుమతించలేదు. దట్టమైన పొగ కారణంగా ముఖ్యమంత్రి కార్యాలయం ఉన్న భవనం పైభాగం పూర్తిగా నల్లగా మారింది. సచివాలయంలో ఏమీ జరగకపోతే.. అసలు ఏం జరిగిందో తెలుసుకునేందుకు కాంగ్రెస్ నేతలను పోలీసులు లోపలికి ఎందుకు అనుమతించలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

కాంప్లెక్స్‌ని వెళ్లేందుకు ప్రయత్నించిన కాంగ్రెస్ నేతల బృందాన్ని అదుపులోకి తీసుకున్నారు. తన పుట్టినరోజున భవనాన్ని ప్రారంభించాలని భావిస్తున్న ముఖ్యమంత్రికి అగ్నిప్రమాదం ఒక విధమైన చెడు శకునమేనని భావిస్తున్నారు. మరి ప్రారంభోత్సవానికి ముందుకు వెళ్తారా లేక వాయిదా వేస్తారా అనేది చూడాలి.

# కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి

హైదరాబాద్, ఫిబ్రవరి 4:నియోజకవర్గ పరిధిలోని కాలనీల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీఫైడ్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని కాలనీల్లో, బస్తీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాజీపడే ప్రసక్తే లేదని, అభివృద్ధి, ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రథమ కర్తవ్యం అని అన్నారు. లక్ష్మీఫైడ్ కాలనీలో తాగునీటి సమస్యలను పరిష్కరించడంతో పాటు డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, అదేవిధంగా కాలనీలో నెలకొన్న విద్యుత్, పారిశుధ్య సమస్యలను అధిగమించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ధన్‌పాల్‌రెడ్డి, సీసీఎస్ ప్రతినిధి పద్మారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, రాంచందర్, సుధాకర్‌రెడ్డి, గంప కృష్ణ, సారా వినోద్, మల్లారెడ్డి, శ్యామ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు రైల్వే డివిజన్‌కు మహర్దశ.. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

అమరావతి, ఫిబ్రవరి 4: ఎన్నో ఏళ్ళకు నిరాదరణకు గురైన గుంటూరు రైల్వే డివిజన్‌కు మహర్దశ పట్టింది.. కేంద్రం ప్రకటించిన రైల్వే బడ్జెట్‌లో అభివృద్ధి పనులకు సింహభాగం కేటాయింపులు జరిగాయి. గత ఏడు, ఎనిమిదేళ్లతో పోలిస్తే ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో రైల్వే ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండానే రైల్వే శాఖనే సొంతంగా ప్రాజెక్టులకు నిధులు కేటాయించింది. కేవలం మూడు ప్రాజెక్టులకు రూ.1,242 కోట్లు కేటాయించడం విశేషం. ఇవికాక స్టేషన్ల అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన, మౌలిక సదుపాయాల పనులకు పెద్దమొత్తంలోనే నిధుల కేటాయింపు జరిగినట్లు- రైల్వే వర్గాలు తెలిపాయి. గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్, నడికుడి - శ్రీకాళహస్తి, గుంటూరు- బీబీనగర్ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించారు. గత కొన్ని దశాబ్దాలుగా డిమాండ్‌లో ఉన్న గుంటూరు ? బీబీనగర్ డబ్లింగ్‌ని ఈ దఫా పింక్‌బుక్‌లో చోటు కల్పించి రూ.60 కోట్లు కేటాయించింది. దీంతో ఈ ప్రాజెక్టుని చేపట్టడానికి తొలి అడుగు వేసినట్లయింది. గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ పనులకు సంబంధించి వివిధ సెక్షన్లను ఈ ఏడాది పూర్తి చేసేందుకు భారీ మొత్తంలో నిధులు ఇచ్చింది.

గుంటూరు రైల్వే డివిజన్‌లో నడికుడి మార్గం ఎంతో కీలకమైనది. తెలంగాణలోని సికింద్రాబాద్ జంక్షన్‌ని అనుసంధానం చేసే మార్గమిది. ఇప్పటికే విద్యుద్దీకరణతో సింగిల్ లేన్ మార్గం అందుబాటు-లో ఉన్నా లైన్ కెపాసిటీ- 100 శాతం దాటింది. ఈ నేపథ్యంలో ఎప్పటి నుంచో గుంటూరు - బీబీనగర్ సెక్షన్ డబ్లింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎట్టకేలకు రైల్వే శాఖ దీనికి కార్యరూపం ఇచ్చింది. 248 కిలోమీటర్ల పొడవునా ఈ రైలుమార్గం నిర్మించాలి. దీనిని పరిగణనలోకి తీసుకున్న రైల్వే బోర్డు అంబరెల్లా వర్కు కింద శాంక్షన్ ఇచ్చింది. రూ.2,480 కోట్ల నిధులు అవసరం కాగా తొలి విడతగా రూ.60 కోట్లు మంజూరు చేసింది. డబ్లింగ్ పూర్తి అయితే తెనాలి ? విజయవాడ - కాజీపేట మీదగా సికింద్రాబాద్ వెళ్లే పలు రైళ్లను గుంటూరు మీదగా మళ్లించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అంతేకాకుండా గరిష్ఠ వేగం కూడా 110 కిలోమీటర్ల నుంచి 130 కిలోమీటర్లకు పెరుగుతుంది. దాంతో వందే భారత్ లాంటి ప్రీమియం రైళ్లని కూడా నడిపేందుకు ఆస్కారం ఉంటుంది.నడికుడి 1 శ్రీకాళహస్తి నూతన రైలుమార్గం పనులు మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.202 కోట్ల నిధులను రైల్వే శాఖ కేటాయించింది. దీంతో ఈ ప్రాజెక్టుకి సంబంధించి పురోగతిలో ఉన్న వివిధ సెక్షన్లలో పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు అవకాశం కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకి 50 శాతం నిధులను సమకూర్చాలి. వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేయడంతో రైల్వే శాఖ సొంతంగా దీనిని పూర్తి చేయాలని నిర్ణయించింది. గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టుని డివిజన్ పరిధిలో వివిధ సెక్షన్లను ఈ ఏడాది పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టు-కున్నారు. దీంతో రూ.980 కోట్ల నిధులను రైల్వే శాఖ కేటాయించింది. ఈ దృష్ట్యా ఈ ఏడాది చివరికల్లా దిగువమెట్ట వరకు అన్ని సెక్షన్లు పూర్తి అవుతాయని అంచనా. ఎర్రబాలెం - అమరావతి నూతన 106 కిలోమీటర్ల రైలుమార్గానికి కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కూడా మొండిచెయ్యి చూపించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు మంజూరైంది. రూ.2,679.59 కోట్ల అంచనాతో ఈ నూతన రైలుమార్గం మంజూరు కాగా ఇప్పటివరకు సర్వే, డీపీఆర్‌లకు కేవలం రూ. 2.20 కోట్లు ఖర్చు పెట్టారు. గత కొన్నేళ్లుగా బడ్జెట్‌లో దీనికి రూ.10 లక్షలు మాత్రమే సంవత్సరానికి కేటాయిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా అంతే మొత్తాన్ని కేటాయించింది. ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడంతో పాటు 50 శాతం నిధులు సమకూర్చాలని గతంలో ఒప్పందం కుదిరింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైల్వే శాఖ దీని విషయంలో అడుగు ముందుకేయడం లేదు.ట్రాక్ రెన్యువల్స్‌కి జోన్ మొత్తం మీదగా రూ.1,360 కోట్లను రైల్వే శాఖ కేటాయించింది. ఇందులో కనీసం రూ.200 కోట్ల వరకు నిధులు గుంటూరు డివిజన్‌కు కేటాయించే అవకాశం ఉన్నట్లు అంచనా. అలానే ప్రయాణికుల సౌకర్యాల కోసం రూ.771 కోట్లు జోన్‌కు ఇచ్చారు. దీనిలోనూ గుంటూరు డివిజన్‌కు రూ.100 కోట్ల వరకు రావొచ్చని అంచనా. గుంటూరు రైల్వేస్టేషన్ యార్డు రీమోడలింగ్, నల్లపాడు ? కృష్ణా కెనాల్ జంక్షన్ 3, 4 లేన్ల నిర్మాణం, అమృత్ భారత్ పథకం కింద రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కూడా నిధులు కేటాయించారు. అయితే గుంటూరు డివిజన్‌కి ఎంత ఇచ్చారనేది కొద్ది రోజుల్లో వివరాలు అందే అవకాశముందని అధికారులు తెలిపారు. అమృత్ భారత్ కింద గుంటూరు, రేపల్లె, నంద్యాల, మంగళగిరి, మార్కాపురం, గిద్దలూరు, పిడుగురాళ్ల, నరసరావుపేట, సత్తెనపల్లి, నడికుడి, వినుకొండ, కంభం, నల్గొండ, మిర్యాలగూడ, మాచర్ల, దొనకొండ రైల్వేస్టేషన్ల అభివృద్ధిని చేపట్టనున్నారు. త్వరలో మరో 14 రైల్వేస్టేషన్లకు కూడా నిధులు వచ్చే అవకాశముంది. గుంటూరు రైల్వేస్టేషన్ యార్డు రీమోడలింగ్ కూడా మంజూరు అయింది.

# బీసీ బిల్లు ఉద్యమానికి మద్దతు ప్రకటించిన కేంద్ర మంత్రి అథవాలె



హైదరాబాద్ ఫిబ్రవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశ పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధనకు కొనసాగుతున్న ఉద్య మానికి మద్దతు ఇస్తామని కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి మంత్రి రాందాస్ అథవాలె అన్నారు.

హైదరాబాద్ కు వచ్చిన సందర్భంగా ఆయన విద్యానగర్ లోని కేంద్ర బిసి భవన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యతో భేటీ అయ్యారు. ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ గతంలో తాను చేపట్టిన ఉద్యమాలు, వాటి ఫలితాలు గురించి చర్చించామన్నారు. ఉద్యమాల ద్వారా రాష్ట్రంలో ఎన్నో పథకాలు అమలు చేయించిన ఘనత ఆర్. కృష్ణయ్యదే నని కొనియాడారు.

# తప్పిన పెను ప్రమాదం.. బస్సులో చెలరేగిన మంటలు..

అమరావతి, ఫిబ్రవరి 4:అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అనాతవరం దగ్గర జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు బస్సు అదుపుతప్పి గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి గోడను ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా దగ్ధమైంది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

# దుండిగల్‌లో బోల్తాపడిన డీసీఎం.. ఇద్దరు మృతి

హైదరాబాద్, ఫిబ్రవరి 4: నగర శివార్లలోని దుండిగల్‌లో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన ఓ డీసీఎం దుండిగల్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. గౌడవెల్లి నుంచి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ గార్డెన్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈఘటనపై కేసు నమోదుచేశామని, దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

# నేడే నాందేడ్ సభ.. అన్ని ఏర్పాట్లు పూర్తి..

హైదరాబాద్, ఫిబ్రవరి 4: బీఆర్ఎస్ పార్టీ విస్తరణలో భాగంగా మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఫిబ్రవరి 5వ తేదీన జరగబోయే సభకు సర్వం సిద్ధమైంది. సభాస్థలి వేదికను బీఆర్ఎస్ శ్రేణులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. నాందేడ్ పట్టణంతోపాటు సభ స్థలికి వెళ్లే దారులన్నీ కిలోమీటర్లమేర గులాబీ మయమయ్యాయి. అక్కడ వరుస క్రమంలో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగులు, బెలూన్లు, స్టిక్కర్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు సభా స్థలిని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శనివారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాలినడకన మైదానమంతా కలియతిరిగి.. సభా వేదిక అలంకరణ, అతిథులు, ముఖ్య నేతల సీటింగ్‌పై నేతలకు దిశానిర్దేశం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ రూపాంతరం చెందిన తర్వాత జాతీయస్థాయిలో జరుగుతున్న తొలి సభ కావడంతో బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యేలు జోగు రామన్న, షకీల్, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ, తదితర నేతలు గత కొన్ని రోజులుగా నాందేడ్‌లో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గత వారం రోజులుగా నాందేడ్‌లో మకాం వేసి ఇతర నేతలతో సమన్వయం చేసుకుంటూ అన్నీ తానై సీఎం సభ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సభ ఏర్పాట్లను దగ్గరుండి చూస్తూనే.. విస్తృతంగా గ్రామాల్లో పర్యటిస్తూ సర్పంచ్‌లు, ఇతర స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను కలుస్తూ సభ విజయవంతానికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. అక్కడి వీధుల్లో కలియ తిరుగుతూ వృద్ధులు, మహిళలు, రైతులు, యువకులను పలకరిస్తూ.. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. దేశ ప్రగతి కోసం జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడానికి ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం సీఎం కేసీఆర్ చేస్తున్న కృషి గురించి తెలియజేస్తున్నారు.

మరోవైపు నాందేడ్ జిల్లా కేంద్రంలో జరగనున్న బీఆర్ఎస్ సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరు అవుతారని అంచనా వేస్తున్నారు. నాందేడ్ జిల్లాలోని నాందేడ్ సౌత్, నార్త్, బోకర్, నాయిగాం, ముఖేడ్, డెగ్లూర్, లోహ నియోజకవర్గాలు, కిన్వట్, ధర్మాబాద్ పట్టణాలు, ముద్కేడ్, నాయిగాం, బిలోలి, ఉమ్రి, హిమాయత్ నగర్, తదితర మండలాల్లోని అన్ని గ్రామాల నుండి పెద్దఎత్తున ప్రజలు తరలి వచ్చే అవకాశం ఉండటంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా నాందేడ్ జిల్లా సరిహద్దు తెలంగాణ నియోజకవర్గాలైన ఆదిలాబాద్, బోథ్, ముధోల్, బోధన్, జుక్కల్‌తో పాటు నిర్మల్, నిజామాబాద్ నియోజకవర్గాల నుంచి కూడా బీఆర్ఎస్ పార్టీ నేతలు, శ్రేణులు సభకు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# రాబోయే ఎన్నికల్లో 50సీట్లలో పోటీ చేస్తాం-అక్బరుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 4:రాబోయే ఎన్నికల్లో 50సీట్లలో పోటీ చేస్తామని ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ఈరోజు తెలంగాణ అసెంబ్లీలో ఎంఐఎం, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం జరగడం తెలిసిందే. అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలకు, మంత్రి కేటీఆర్ ఘాటుగా బదులిచ్చారు. ఎంఐఎం ఎమ్మెల్యేలు ఉన్నదే ఏడుగురని, వారికి అధిక సమయం కేటాయించరని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించడం తెలిసిందే. దీనిపై అక్బరుద్దీన్ ఒవైసీ కౌంటర్ ఇచ్చారు. ఏడుగురు ఎమ్మెల్యేలే ఉన్నారని కేటీఆర్ అన్నారని, దీన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. తమ పార్టీ అధినేత అంగీకరిస్తే వచ్చే ఎన్నికల్లో 50 స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. దీనిపై తాను పార్టీ చీఫ్ తో మాట్లాడతానని వెల్లడించారు. ఏడుగురు కాదు కనీసం 15 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యేలా చూస్తామని అక్బరుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. ఈసారి మరింతమంది ఎమ్మెల్యేలతో సభలో అడుగుపెడతామని చెప్పారు. కాగా అంతకుముందు అసెంబ్లీలో అక్బరుద్దీన్ మాట్లాడుతూ పాతబస్తీకి అన్యాయం జరుగుతోందంటూ ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

# బిగ్‌బాష్ లీగ్ విజేత పెర్త్ స్కార్చర్స్.. ఫైనల్లో బ్రిస్బేన్ హీట్‌పై 5 వికెట్ల తేడాతో విజయం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:ఆస్ట్రేలియాలో జరిగిన బిగ్‌బాష్ లీగ్‌లో పెర్త్ స్కార్చర్స్ విజేతగా నిలిచింది. ఫైనల్లో బ్రిస్బేన్ హీట్‌పై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. దాంతో, ఐదోసారి బిగ్‌బాష్ లీగ్ ట్రోఫీ నెగ్గిన జట్టుగా రికార్డు క్రియేట్ చేసింది. జిమ్మీ పియెర్సన్ నాయకత్వంలోని బ్రిస్బేన్ హీట్ ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసింది. ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 రన్స్ చేసింది. బ్రిస్బేన్ హీట్ ఇన్నింగ్స్‌లో మిడిలార్డర్ బ్యాటర్ నాథన్ మెక్‌స్వీన్ (41) టాప్ స్కోరర్. 176 టార్గెట్ చేధనలో పెర్త్ స్కార్చర్స్ ఆటగాడు ఆష్టన్ టర్నర్ హాఫ్ సెంచరీ (51)తో రాణించాడు. చివర్లో కూపర్ 11 బంతుల్లో 25 రన్స్ చేయడంతో ఆ జట్టు 19.2 ఓవర్‌లోనే లక్ష్యాన్ని చేధించింది. పెర్త్ స్కార్చర్స్ జట్టు 2014, 2015, 2017, 2022లో బిగ్‌బాష్ లీగ్ ఛాంపియన్‌గా అవతరించింది.

ఈ మ్యాచ్‌లో పెర్త్ స్కార్చర్స్ బౌలర్ ఆండ్రూ టై ప్రపంచ రికార్డు బద్దలు కొట్టాడు. ఈ ఫార్మాట్‌లో వేగంగా 300 వికెట్లు తీసిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. జేమ్స్ బజిలేను ఔట్ చేసి 300 వికెట్ సాధించాడు. ఈ ఆస్ట్రేలియా పేసర్ 211 మ్యాచుల్లోనే 300 వికెట్లు తీసి రషీద్ ఖాన్ రికార్డును బ్రేక్ చేశాడు. రషీద్ 213 మ్యాచుల్లో 300 వికెట్లు పడగొట్టాడు.

# తల్లిదండ్రులు కాబోతున్న ట్రాన్స్‌జెండర్ జంట.. దేశంలోనే మొదటిసారి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:కేరళ రాష్ట్రం కోజికోడ్‌కు చెందిన జియా- జహద్ అనే ట్రాన్స్‌జెండర్ జంట శుభవార్త చెప్పింది. త్వరలో తాము తల్లిదండ్రులు కాబోతున్నామంటూ సోషల్ మీడియా ద్వారా ప్రకటించింది. మార్చి నెలలో తమ తొలిబిడ్డకు జన్మనివ్వబోతున్నట్లు తెలిపింది. గత మూడేళ్లుగా సహజీవనం చేస్తున్న ఈ జంట బుధవారం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ సంతోషకరమైన వార్తను ప్రకటించింది.

'నేను పుట్టుకతో స్త్రీని కానప్పటికీ, ఒక శిశువు నన్ను 'అమ్మా' అని పిలవాలనే కల నాలో ఉంది. మేము కలిసి మూడు సంవత్సరాలు అయ్యింది. తల్లి కావాలని నేను, తండ్రి కావాలని అతను (జహాద్) కలలు కన్నాం. ఆ కల త్వరలో నెరవేరబోతోంది. అతని కడుపులో ఎనిమిది నెలల జీవం ప్రాణం పోసుకుంటోంది' అని అమ్మాయిలా మారిన జియా పావెల్ ఇన్‌స్టాలో రాసుకొచ్చింది. అయితే ఓ ట్రాన్స్‌జెండర్ జంట బిడ్డకు జన్మనివ్వడం దేశంలోనే ఇదే తొలిసారి. అయితే, సంతానం కోసం.. అబ్బాయిగా మారే చికిత్సను జహాద్ వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది.

ట్రాన్స్ జెండర్ల జంట తమ లింగాన్ని మార్చుకోవడానికి శస్త్ర చికిత్సను ఆశ్రయించారు. జియా పురుషుడిగా జన్మించగా.. స్త్రీగా మారాడు. అయితే జహాద్ స్త్రీగా జన్మించగా? తరువాత పురుషుడిగా మారాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే శస్త్ర చికిత్స కూడా చేయించుకున్నాడు. కానీ ఈ సర్జరీలో అతని గర్భాశయం, మరికొన్ని అవయవాలు తొలగించలేదు. ఈ క్రమంలోనే అతడు గర్భవతి అయ్యాడు.

# పొట్ట చుట్టూ 51 సార్లు వాతలు!.. మూఢనమ్మకాలకు మూడు నెలల చిన్నారి బలి..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:మూఢనమ్మకాలకు మూడు నెలల చిన్నారి బలైంది. వ్యాధి తగ్గాలని చిన్నారి శరీరంపై 51 సార్లు ఇనుప కడ్డీతో వాతలు పెట్టారు. అయినా వ్యాధి తగ్గకపోవడంతో 15 రోజులు మృత్యువుతో పోరాడి ఓడిపోయింది అభం శుభం తెలియని ఆ పసికందు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..

గిరిజన ప్రాంతమైన షాదోల్ జిల్లాలోని సింగ్‌పుర్ కథౌటియా గ్రామానికి చెందిన మూడు నెలల చిన్నారి నివోనియా (ఖనివబీఎనీనితిజీ) బారినపడింది. దీంతో చిన్నారికి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది.

తల్లిదండ్రులు పాపను వైద్యుల వద్దకు తీసుకెళ్లకుండా స్థానికంగా ఉన్న మంత్రగాళ్లకు చూపించారు. ఈ క్రమంలో మంత్రగాళ్లు పాప పొట్ట చుట్టూ కాల్చిన ఇనుప రాడ్డుతో 51 సార్లు వాతలు పెట్టారు. అయినప్పటికీ చిన్నారి ఆరోగ్యం కుదుట పడలేదుసరి కదా.. మరింత దిగజారింది.

దీంతో వారు పసికందును స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, చిన్నారికి వ్యాధి సోకి అప్పటికే 15 రోజులు గడిచిపోవడంతో జరగరాని నష్టం జరిగిపోయింది.

నిమోనియాకు సరైన సమయంలో వైద్యం అందకపోవడంతో ఇన్‌ఫెక్షన్ ఎక్కువై చిన్నారి మృతి చెందింది. పాపకు తల్లిదండ్రులు అంత్యక్రియలు పూర్తి చేశారు. శుక్రవారం శిశు, సంక్షేమ శాఖ అధికారులు ఆసుపత్రికి వెళ్లగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వెంటనే వారు చర్యలు చేపట్టారు. చిన్నారిని ఖననం చేసిన చోటుకెళ్లి.. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేసేందుకు చర్యలు చేపట్టారు.

# ఓటీటీలోకి వచ్చేస్తున్న వారసుడు మూవీ.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

హైదరాబాద్, ఫిబ్రవరి 4: ఎన్నో వివాదాల నడుమ సంక్రాంతి కానుకగా రిలీజైన 'వారసుడు' తమిళంలో సూపర్ హిట్టయి తెలుగులో బ్రేక్ ఈవెన్ సాధించకుండానే థియేటర్‌లలో నుండి వెళ్లిపోయింది. 'తుపాకీ' తర్వాత అంచెలంచెలుగా మార్కెట్ విస్తరించుకుంటున్న విజయ్‌కు గత రెండు మూడు సినిమాలు తెలుగులో ఆశించిన స్థాయిలో కలెక్షన్‌లు రాబట్టలేకపోయాయి. అయితే వారసుడు మూవీకి విజయ్‌కు తెలుగులో ఉన్న మార్కెట్ కంటే ఎక్కువే బిజినెస్ జరిగింది. దాంతో బ్రేక్ ఈవెన్ దగ్గరి వరకు వచ్చి ఆగిపోయింది. పైగా వీరసింహా రెడ్డి, వాల్తేరు వీరయ్య వంటి మాస్ కమర్షియల్ సినిమాలు పోటీగా ఉండటం.. ప్రేక్షకులందరూ వాటికే ఓటేయడంతో తెలుగులో యావరేజ్ హిట్‌తో సరిపెట్టుకుంది. వంశీపైడిపల్లి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ రిలీజ్‌కు సిద్ధమవుతుంది.

ఈ సినిమా ఓటీటీ హక్కులను అమెజాన్ సంస్థ దక్కించుకుంది. కాగా ఫిబ్రవరి 22నుండి ఈ సినిమాను స్ట్రీమింగ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే చాన్స్ ఉంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాకు వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించాడు. విజయ్‌కు జోడీగా రష్మిక మందన్న నటించింది. శ్రీ వెంకటేశ్వరా క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించాడు. నిజానికి ఈ సినిమా జనవరి 11నే తెలుగులో రిలీజ్ కావాల్సి ఉంది. కానీ పలు కారణాల వల్ల మూడు రోజులు వెనక్కి జరిగింది. అయితే ముందచ్చుంటే మాత్రం ఈ సినిమా రిజల్ట్ వేరేలా ఉండేది. ఇక ఇప్పటి వరకు టోటల్‌గా ఈ మూవీ రూ.200 కోట్లకు పైగా గ్రాస్‌ను కలెక్ట్ చేసింది.

# కష్టకాలం ముగిసింది.. గట్టిగా ఊపిరి పీల్చుకో.. సమంత ఎమోషనల్ నోట్ వైరల్..!

హైదరాబాద్, ఫిబ్రవరి 4: గాడ్‌ఫాదర్ లేకుండా సినీరంగంలో నిలదొక్కుకోవడం అంటే చిన్న విషయం కాదు. అందులోనూ ఒక అమ్మాయి ఇండస్ట్రీ రాణించాలంటే ఎన్నో సవాళ్లను, మరెన్నో వివాదాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటిన్నిటి అధిగమించి దశాబ్దానికి పైగా టాలీవుడ్‌లో చక్రం తిప్పిన కథానాయిక సమంత. 'ఏమాయ చేసావే' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ మద్రాసి సోయగం అనతి కాలంలోనే అగ్ర హీరోలతో జోడీ కట్టి టాలీవుడ్‌లో ఎక్కడ లేని క్రేజ్ తెచ్చుకుంది. ప్రస్తుతం హీరోల కంటే తానేమి తక్కువ కాదని లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బాక్సాఫీస్ దగ్గర తన సత్తా చూపిస్తుంది.

కాగా గతేడాది సమంత మయోసైటిస్ అనే అరుదైన వ్యాధి బారిన పడిన విషయం చెప్పి అందరిని షాక్‌కు గురిచేసింది. ప్రస్తుతం ఆ వ్యాధి నుండి కోలుకుంటుంది. ఎవరి సాయం లేకున్నా ఒంటిరిగా పోరాడుతూ సినిమాల్లోనే కాదు నిజజీవితంలోనూ తను సక్సెస్ అని నిరూపించుకుంటుంది. ఈ వ్యాధి కారణంగా గతకొన్ని నెలలుగా షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చిన సమంత.. ఇటీవలే ఫ్యామిలీమ్యాన్ రూపకర్తలు తెరకెక్కిస్తున్న 'సిటాడెల్' వెబ్‌సిరీస్ కోసం కెమెరా ముందుకు వచ్చింది. రీసెంట్‌గానే ఈ వెబ్‌సిరీస్‌లోని సమంత లుక్ బయటకు వచ్చింది. స్టైలిష్ కాప్‌గా సామ్ లుక్‌కు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. కాగా ఇన్ని రోజులు తను ఎదుర్కొన్న ఇబ్బందులను తలుచుకుంటూ సామ్ పలు ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేస్తూ ఓ ఎమోషనల్ పోస్ట్‌ను పెట్టింది. 'గట్టిగా ఊపిరి పీల్చుకో పాప. త్వరలో అన్నీ చక్కబడతాయని నేను నీకు మాటిస్తున్నా. గడిచిన ఏడెనిమిది నెలలుగా నువ్వు అత్యంత ఇబ్బందికరమైన రోజులు చూసస్తూ ముందుకు సాగావు. వాటిని మర్చిపోవద్దు. ఆ క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కొన్నావో ఎప్పటికీ గుర్తుపెట్టుకో. అన్ని ఇబ్బందులను తట్టుకుని ధైర్యంగా అడుగులేశావు. నీ విషయంలో ఎంతో గర్వంగా ఉన్నా. నువ్వు కూడా నాలాగే గర్వపడు. ధైర్యంగా మరింత ముందుకు సాగిపో' అంటూ తనకు తనే చెబుతున్నట్లుగా సమంత ఓ నోట్‌ను రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట తెగ వైరల్ అవుతుంది.

ప్రస్తుతం సామ్ ప్రధాన పాత్రలో నటించిన పాన్ ఇండియా మూవీ 'శాకుంతలం' రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. గుణశేఖర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను ముందుగా మహాశివరాత్రి కానుకగా రిలీజ్ చేయాలని అనుకున్నా.. పఠాన్ జోరు ఇంకా కొనసాగుతుండటంతో విడుదల తేదీని వాయిదా వేసినట్లు తెలుస్తుంది. ఇక దీనితో పాటు విజయ్‌తో కలిసి 'ఖుషీ' మూవీ చేస్తుంది. గతేడాదే రెండు షెడ్యూల్స్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో మూడో షెడ్యూల్ ప్రారంభించనుంది.

# తొలి టెస్టుకు కామెరూన్ గ్రీన్ దూరం కానున్నాడా..? ఆస్ట్రేలియా కోచ్ ఏం అన్నాడంటే..?



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: ఆస్ట్రేలియా యంగ్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ నాగ్‌పూర్ టెస్టులో ఆడతాడా? లేదా? అనే సందిగ్గత నెలకొంది. ఒకవేళ అతను తొలి మ్యాచ్‌కు దూరమైతే ఆసీస్‌కు పెద్ద దెబ్బ తగిలినట్టే. అయితే.. ఆ జట్టు ప్రధాన కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ గ్రీన్‌కు తుది జట్టులో చోటు దక్కనుందా? అనే విషయమై క్లారిటీ ఇచ్చాడు. అలూర్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. గ్రీన్ మొదటి టెస్టు ఆడే అవకాశాల్ని కొట్టిపారేయలేమని చెప్పాడు. 'ఆల్‌రౌండర్ గ్రీన్ గాయం నుంచి వేగంగా కోలుకుంటున్నాడు. బౌలింగ్ చేసేటప్పుడు అతనికి ఏ ఇబ్బంది ఉండదని అనుకుంటున్నా. అయితే.. గ్రీన్ తొలి మ్యాచ్ ఆడే అవకాశాలు చాలా తక్కువ' అని మెక్‌డొనాల్డ్ తెలిపాడు. గ్రీన్ ఆడేది లేనిది రెండు మూడు రోజుల్లో తెలియనుంది.

స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన బాక్సింగ్ డే టెస్టు సిరీస్‌లో గ్రీన్ వేలికి గాయం అయింది. దాంతో అతను భారత్‌తో తొలి టెస్టుకు దూరం కానున్నాడనే వార్తలు వినిపించాయి. అయితే.. ఆసీస్‌కు కీలకమైన ఈ యంగ్ ఆల్‌రౌండర్ నెట్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేస్తూ కనిపించాడు. 2022లో గ్రీన్ భారత పర్యటనలో బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఉపఖండ పిచ్‌ల మీద చెలరేగే అతడు ఆసీస్‌కు ప్రధాన అస్త్రం. టెస్టుల్లో నంబర్ 1 ర్యాంకులో ఉన్న ఆసీస్ ఇప్పటికే వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరింది. రెండో స్థానంలో ఉన్న భారత్ ఈ సిరీస్ గెలిస్తే ఫైనల్ బెర్తు ఖరారు చేసుకుంటుంది.

# బాలెనోకు పోటీగా ఆల్ట్రోజ్ సీఎన్జీ.. మైక్రో ఎస్‌యూవీలో ఫస్ట్ పంచ్.. మార్కెట్‌లోకి ఎప్పుడంటే?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:ఇప్పుడు ప్రతి ఒక్కరూ తమ వెహికల్స్.. ప్రత్యేకించి తక్కువ ధరతో ఎక్కువ మైలేజీనిచ్చే కార్ల కొనుగోలుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. కస్టమర్ల ఆకాంక్షలను గమనిస్తున్న కార్ల తయారీ సంస్థలు కూడా అదే రూట్‌లో అడుగులేస్తున్నాయి. సీఎన్జీ వేరియంట్ కార్లను మార్కెట్‌లోకి తేవడానికి పోటీ పడుతున్నాయి. దేశీయ కార్ల మార్కెట్‌లో మూడో స్థానంలో ఉన్న టాటా మోటార్స్ ఆ పోటీలో ముందున్నట్లు సంకేతాలిస్తున్నది. ఇప్పటికే పాపులర్ మోడల్ కార్లుగా ఉన్న పంచ్, ఆల్ట్రోజ్ సీఎన్జీ వేరియంట్లను మార్కెట్‌లోకి తేనున్నట్లు ప్రకటించింది.వచ్చే జూన్‌లో పంచ్ సీఎన్జీ, ఆల్ట్రోజ్ సీఎన్జీ వేరియంట్ కార్లు దేశీయ రోడ్లపై పరుగులు తీయనున్నాయి. ఇటీవలే ముగిసిన ఆటో ఎక్స్‌పోలో కూడా ఈ రెండు కార్లను ప్రదర్శించింది టాటా మోటార్స్. గతేడాది ఫిబ్రవరిలో టియాగో సీఎన్జీ, టైగోర్ సీఎన్జీ వేరియంట్ కార్లు ఆవిష్కరించింది. మారుతి బాలెనో సీఎన్జీ, టయోటా గ్లాంజా సీఎన్జీలతో ఆల్ట్రోజ్ సీఎన్జీ పోటీ పడనున్నది. మైక్రో ఎస్‌యూవీ సెగ్మెంట్ కారు పంచ్ తొలి సీఎన్జీ వేరియంట్ కానున్నది.

ట్విన్ సిలిండర్ ట్యాంక్ సెటప్‌తో ఆల్ట్రోజ్.. పంచ్

టాటా ఆల్ట్రోజ్ సీఎన్జీ, పంచ్ సీఎన్జీ కార్లు ట్విన్ సిలిండర్ ట్యాంక్ సెటప్‌తో వస్తున్నాయి. ఈ రెండు కార్లలోనూ 60 లీటర్ల ఇంధన కెపాసిటీ ఉంటుంది. అయినా రెండు కార్ల బూట్ స్పేస్‌లో ఏమాత్రం తేడా ఉండదు. దీనిపై టాటా మోటార్స్ అధికారికంగా స్పందించలేదు. టాటా ఆల్ట్రోజ్ పెట్రోల్ వేరియంట్‌లో 345 లీటర్ల బూట్ స్పేస్, పంచ్ పెట్రోల్ వేరియంట్‌లో 366 లీటర్ల బూట్ స్పేస్ అందుబాటులో ఉంది.

ఆ రెండు ఇంజిన్ల కెపాసిటీ ఇదీ

ఆల్ట్రోజ్-పంచ్ పెట్రోల్ వేరియంట్లలో 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ ఉంది. 84 బీహెచ్పీ పవర్, 113 ఎన్ఎం టార్చి దీని సామర్థ్యం. సీఎన్జీ వేరియంట్ ఇంజిన్లలో 76 బీహెచ్పీ పవర్, 97 ఎన్ఎం టార్చి వెలువరించే సామర్థ్యం కలిగి ఉంటుంది. రెగ్యులర్ పెట్రోల్ వేరియంట్ కార్లలో 5-స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్‌తోపాటు 5-స్పీడ్ ఏఎంటీ గేర్ బాక్స్ ఆప్షన్ ఉంటది. టియాగో ఐ-సీఎన్జీ వేరియంట్ కారు మాదిరే ఆల్ట్రోజ్ అండ్ పంచ్ సీఎన్జీ వేరియంట్ కార్ల ఇంజిన్‌తో కిలో సీఎన్జీ గ్యాస్‌తో 26-27 కి.మీ. మైలేజీ సామర్థ్యం ఉంటుందని ప్రకటిస్తున్నది టాటా మోటార్స్.

రెండు కార్లలో ఫీచర్లు ఇవే

పెట్రోల్ కార్లలో మాదిరిగానే టాటా ఆల్ట్రోజ్ అండ్ పంచ్ సీఎన్జీ వేరియంట్ కార్లలో ఆపిల్ కార్ ప్లే, ఆండ్రాయిడ్ ఆటో కనెక్టివిటీ, ఆటోమేటిక్ ఏసీ, రివర్స్ పార్కింగ్ కెమెరా, 7-అంగుళాల టీఎఫ్‌టీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 7-ఇంచ్ హర్మాన్ ఇన్ఫోటైన్‌మెంట్ విత్ పుష్ బటన్ స్టార్ట్/స్టాప్ సిస్టమ్ ఉంటాయి.

# అన్‌స్టాపబుల్ 2లో రికార్డులు బ్రేక్ చేసిన పవర్ స్టార్ ఎపిసోడ్-1, రేపు పార్ట్ 2 గురించి ప్రోమో!




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మొదటిసారిగా ఓటిటి షోలో పాల్గొని దానిలో కూడా రికార్డులు బద్దలు కొడుతున్నారు. ఆ షో నే నందమూరి నటసింహం బాలకృష్ణ హోస్ట్ గా చేస్తున్న "అన్‌స్టాప్పబుల్ 2".

మరి ఇందులో పవర్ ఫినాలే గా వచ్చిన ఈ సూపర్ హిట్ ఎపిసోడ్ రెండు పార్ట్స్ గా ప్లాన్ చేయగా మొన్న వచ్చిన పార్ట్ 1 ఎపిసోడ్ రికార్డులు బ్రేక్ చేసింది.

ఇక ఇప్పుడు ఆహాలో మరో సూపర్ అప్డేట్ ని ఈ ఎపిసోడ్ పార్ట్ 2 పై అందించారు. పార్ట్ 1 ఎపిసోడ్ తో రికార్డులు బ్రేక్ చేసేలా జాతర జరిగింది పార్ట్ 2 తో కూడా అంతకు మించే ఉంటుందని ఈ ప్రోమో ని ఫిబ్రవరి 5 న రిలీజ్ చేస్తున్నట్టుగా డేట్ ఫిక్స్ చేశారు. అంటే రేపే ఈ అవైటెడ్ ఎపిసోడ్ ప్రోమో వచ్చేస్తుంది అని చెప్పాలి. మరి రేపు వచ్చే ఈ ప్రోమోలో ఎలాంటి అంశాలు ఉంటాయో చూడాల్సిందే

# యూజీ ఆయూష్ కన్వీనర్ కోటా సీట్లకు 5,6వ తేదీల్లో వెబ్‌ఆప్షన్లు

వరంగల్, ఫిబ్రవరి 4: యూజీ ఆయూష్ వైద్యవిద్య సీట్ల భర్తీకి ఈనెల 5,6వ తేదీల్లో మాప్ అఫ్ విడత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈమేరకు శనివారం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. యూనివర్సిటీ పరిధిలోని ఆయూష్ కళాశాలల్లో హోమియోపతి (బీహెచ్ఎంఎస్), ఆయుర్వేద (బీఏఎంఎస్), యూనాని (బీయూఎంఎస్), నేచురోపతి-యోగా (బీఎన్‌వైసీ) కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈనెల 5న ఉదయం 8 గంటల నుంచి 6న సాయంత్రం 6 గంటల వరకు అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.



# ఘనంగా డాక్టర్ గోలి మోహన్ జన్మదిన వేడుకలు

## - జన్మదిన వేడుకలు సమాజం కోసం ఉపయోగపడాలి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 4: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణానికి చెందిన డాక్టర్ గోలి మోహన్ జన్మదిన వేడుకలను కౌన్సిలర్ గోలి మహేష్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ గోలి మోహన్ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఉదయం శ్రీరాజరాజేశ్వరస్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకొని, స్వామి వారిని దర్శించుకొని ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న యాచకులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. తర్వాత కరీంనగర్ బ్లడ్ బ్యాంక్ వారిచే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొని 200 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారందరికీ మెమోంటోలు అందజేశారు. మరియు తిప్పాపూర్ ఏరియా హాస్పిటల్ లో 100 మంది పేషంట్లకి పండ్ల పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా గోలి మహేష్ మాట్లాడుతూ డాక్టర్ గోలి మోహన్ పుట్టినరోజు వేడుకలకు యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయడం హర్షణీయమని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న డాక్టర్ గోలి మోహన్ ను ఇలాగే ఆదరాభిమానాలతో ఆదరించాలని, యువతకు ఇటీవల జాబ్ మేళా నిర్వహించి, ఉద్యోగాల్లో నియమింపజేసినట్లుగానే ఇంకా మున్ముందు కూడా జాబ్ మేళాలు నిర్వహించి యువతకు మార్గదర్శకులుగా ఉంటారని 27 వ వార్డు కౌన్సిలర్ గోలి మహేష్ తెలిపారు. అనంతరం డాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ యువత సన్మార్గంలో సత్ప్రవర్తన తో మెలగాలని, ఇలాంటి స్ఫూర్తితోనే యువత సామాజిక సేవకార్యక్రమాల్లో పాల్గొనడం హర్షణీయమని, నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు అని డాక్టర్ గోలి మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాజటిల్లు, సాయి, రవి, తిరుపతి, కిషన్, హరీష్, దేవయ్య, వంశీ, సాయి కృష్ణ, సమీర్ వీరితోపాటు 200 మంది యువకులు పాల్గొన్నారు





# హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ షురూ

హైదరాబాద్ ఫిబ్రవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):: 12వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ శుక్రవారం ఘనంగా ఆరంభమైంది. నాలుగు రోజుల పాటు జరుగనున్న మెగా ఈవెంట్‌లో దేశవ్యాప్తంగా 337 మంది అథ్లెట్లు పోటీపడుతున్నారు. వివిధ ఏజ్ విభాగాల్లో నిర్వహించే ఈ టోర్నీలో తొలిసారి మహిళల సింగిల్స్ ఓపెన్ విభాగాన్ని ప్రవేశపెట్టారు. అంతర్జాతీయ సీడెడ్ ఆటగాళ్లు సైతం పోటీపడుతున్న ఈ టోర్నమెంట్‌ను ఎల్బీ స్టేడియంలో హైదరాబాద్ నార్త్‌జోన్ ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఆరంభ కార్యక్రమంలో హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్. శ్రీనివాస్, కో ఆర్డినేటర్ హరికృష్ణరెడ్డి, ఎఫ్ఎంసీ అధ్యక్షుడు వెంకట ప్రసాద రెడ్డి, హెచ్‌సీఏ మాజీ కార్యదర్శి శేషు నారాయణ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పోటీపడుతున్న 337 మందికి హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హెచ్ఓటీఏ) ఉచిత భోజన, వసతి సదుపాయం ఏర్పాటు చేసింది.

# అల్ ఇండియా అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థినిలు




రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 4: (నేటినిజం ప్రతినిధి): బీహార్ లోని పాట్నాలో జరిగే ఈ నెల 10, 11,12వ తేదీల్లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలకు వేములవాడ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినిలు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్యామల తెలిపారు. పాఠశాలకు చెందిన ఆవునూరి చేతన షార్ట్ పుట్, ఏమునూరి కావ్య లాంగ్ జంప్ పోటీలలో పాల్గొనేందుకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ క్రమంలో ఎంపికైన విద్యార్థినీలను ప్రిన్సిపాల్ తో పాటు పి.ఈ.టి జ్యోతి ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# టెస్టుల్లో పునరాగమనం జడ్డూకు అంత సులభం కాదు : కోహ్లీ చిన్నప్పటి కోచ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:భారత జట్టు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా పునరాగమనంపై అతను విరాట్ కోహ్లీ చిన్నప్పటి కోచ్ రాజ్ కుమార్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. బోర్డర్ ? గవాస్కర్ ట్రోఫీతో పునరాగమనం చేస్తున్న జడేజా రాణించడంపై తాను ఆందోళన చెందుతున్నానని అన్నాడు. ఆసీస్‌తో సిరీస్ అతనికి అంత సులభం కాదని రాజ్ కుమార్ తెలిపాడు. 'టెస్టు క్రికెట్‌లో రీ–ఎంట్రీలో ఇస్తున్న జడేజా రాణించడంపై నాకు ఆందోళనగా ఉంది. అందుకు కారణం ఏంటంటే.. అతను చాలా రోజులుగా అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. జడ్డూ ప్రపంచంలో ఫిట్‌గా ఉన్న ఆటగాళ్లలో ఒకడు. అయితే.. అతను ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అది కూడా అస్ట్రేలియాపై పునరాగమనం చేస్తున్నాడు. అందుకని ఈ సిరీస్‌లో రాణించడం అతనికి అంత సులభం కాదు' అని రాజ్‌కుమార్ వెల్లడించాడు. 1998లో ఢిల్లీ క్రికెట్ అకాడమీలో రాజ్‌కుమార్ శర్మ దగ్గర కోహ్లీ ట్రైనింగ్ తీసుకున్నాడు.

పోయిన ఏడాది ఆసియా కప్‌లో మోకాలి గాయం కావడంతో జడ్డూ టీ20 వరల్డ్ కప్‌కి దూరమయ్యాడు. 34 ఏళ్ల ఈ ఆల్‌రౌండర్ ఆగస్టులో చివరిసారిగా మైదానంలో దిగాడు. అయితే.. గాయం నుంచి కోలుకున్న అతను ఫిట్‌నెస్ పరీక్షలో నెగ్గాడు. దాంతో బోర్డర్ ? గవాస్కర్ ట్రోఫీ తొలి రెండు టెస్టులకు బీసీసీఐ అతడిని ఎంపిక చేసింది. దాదాపు ఆరు నెలల విరామం మైదానంలోకి దిగిన జడేజా రంజీ ట్రోఫీలో సౌరాష్ట్ర తరఫున ఒక మ్యాచ్ ఆడాడు. తమిళనాడుపై 8 వికెట్లు తీసి, టెస్టు క్రికెట్‌లో తాను ఎంత కీలకమో మరోసారి చాటాడు. ఆల్‌రౌండర్‌గా ఇండియాకు ఎన్నో విజయాలు అందించిన జడేజాకు ఆసీస్ సిరీస్ నిజంగానే పరీక్ష కానుంది. బ్యాటుతో, బంతితో అతను రాణించడం భారత్‌కు చాలా ముఖ్యం. ఫిబ్రవరి 9న నాగ్‌పూర్‌లో తొలి టెస్టులో భారత్, ఆస్ట్రేలియా తలపడనున్నాయి.

# టీ20ల్లో ప్రపంచ రికార్డు బద్దలు కొట్టిన ఆండ్రూ టై.. రషీద్ ఖాన్‌ను దాటేశాడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: పొట్టి క్రికెట్‌లో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ ఆండ్రూ టై ప్రపంచ రికార్డు బద్ధలు కొట్టాడు. ఈ ఫార్మాట్‌లో వేగంగా 300 వికెట్లు తీసిన బౌలర్‌గా అతను చరిత్ర సృష్టించాడు. 211 మ్యాచుల్లోనే అతను ఈ ఘనత సాధించడం విశేషం. అఫ్గనిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ రికార్డును ఆండ్రూ టై బ్రేక్ చేశాడు. రషీద్ 213 మ్యాచుల్లో 300 వికెట్లు పడగొట్టాడు. బిగ్‌బాష్ లీగ్‌లో పెర్త్ స్కార్చెర్స్‌కు ఆడుతున్న టై ఫైనల్లో బ్రిస్బేన్ హీట్‌పై జేమ్స్ బాజ్‌లేను ఔట్ చేసి 300 వికెట్ సాధించాడు.

పొట్టి క్రికెట్‌లో అతి తక్కువ మ్యాచుల్లో 300 వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో శ్రీలంక దిగ్గజం లసిత్ మలింగ మూడో స్థానంలో ఉన్నాడు. అతను 222 మ్యాచుల్లో 300 వికెట్లు తీశాడు. 2020లో రషీద్ ఖాన్, మలింగ రికార్డును బ్రేక్ చేశాడు. సీపీఎల్ టోర్నీలో బార్బడోస్ ట్రిడెంట్‌కు ఆడిన అతను సెయింట్ లూసియా జౌక్స్ ఆల్‌రౌండర్ మహ్మద్ నబీని ఔట్ చేయడంతో 300 వికెట్ల క్లబ్‌లో చేరాడు. బిగ్‌బాష్ లీగ్‌లో ఆండ్రూ టై అద్భుత ప్రదర్శన చేశాడు. ఈ సీజన్‌లో అతను 26 వికెట్లు నేలకూల్చి పెర్త్ స్కార్చెర్స్ ఫైనల్ చేరడంలో తన వంతు పాత్ర పోషించాడు. బ్రిస్బేన్ హీట్‌తో జరిగిన ఫైనల్లో పెర్త్ స్కార్చెర్స్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది.

# 'పఠాన్' అసలు కలెక్షన్ ఎంతన్న నెటిజన్.. దిమ్మతిరిగే రిప్లై ఇచ్చిన షారూఖ్ ఖాన్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:బాలీవుడ్ సూపర్ స్టార్ షారూఖ్ ఖాన్ ఇవాళ ఓ సోషల్ మీడియా యూజర్ అడిగిన ప్రశ్నకు దిమ్మతిరిగే సమాధానం చెప్పాడు. ఇటీవల విడుదలైన షారూఖ్ బ్లాక్ బస్టర్ మూవీ 'పఠాన్' అసలు కలెక్షన్ ఎంతని ఓ ట్విటర్ యూజర్ ఆరాతీయగా.. బాలీవుడ్ బాద్‌షా అదిరిపోయే రిప్లై ఇచ్చాడు. అభిమానులతో నేరుగా టచ్‌లో ఉండేందుకు షారూఖ్ ఖాన్ ట్విటర్‌లో 'ఆస్క్ మీ ఎనీథింగ్' పేరుతో ఒక సెషన్ నిర్వహిస్తున్నాడు. ఆ సెషన్‌లో భాగంగానే ఒక ట్విటర్ యూజర్ పఠాన్ సినిమా అసలు కలెక్షన్ ఎంతని ప్రశ్నించాడు. సోషల్ మీడియాలో ఎదురయ్యే ఇలాంటి ప్రశ్నలకు చమత్కారంగా, ఉల్లాసంగా సమాధానం ఇవ్వడంలో ఆరితేరిన షారూఖ్ ఈ ప్రశ్నకు కూడా తనదైన శైలిలో.. '5 వేల కోట్ల మంది ప్రేమ. 3 వేల కోట్ల మంది ప్రశంసలు. 3,250 కోట్ల మంది కౌగిలింతలు? రెండు బిలియన్‌ల (సుమారు 16 వేల కోట్లు) మంది నవ్వులు, ఇంకా లెక్కింపు కొనసాగుతున్నది' అని జవాబిచ్చాడు. చివరలో 'నీ అకౌంటెంట్ నీకు ఏం చెప్పాడు..' అంటూ చమత్కరించాడు.

సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో, యశ్‌రాజ్ ఫిల్మ్ నిర్మాణ సారథ్యంలో రూపుదిద్దుకున్న పఠాన్ సినిమా జనవరి 25న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదలైంది.

ఈ సినిమాకు షారూఖ్ అభిమానుల నుంచి, సాధారణ ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. దాంతో ఈ సినిమా బాలీవుడ్ బ్లాక్ బస్టర్‌గా మారింది. తొలిరోజే రూ.100 కోట్ల కలెక్షన్‌లు రాబట్టింది. తొలి 8 రోజుల్లో ఈ సినిమాకు వచ్చిన కలెక్షన్‌ల మొత్తం రూ.364 కోట్లను దాటింది.

# బాలీవుడ్‌లో పఠాన్ విధ్వంసం.. దంగల్ రికార్డు బ్రేక్..!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: సినిమా విడుదలై పది రోజులవుతున్న ఇంకా 'పఠాన్' జోరు ఎక్కడా తగ్గడం లేదు. రోజు రోజుకు టిక్కెట్‌లు భారీగా తెగుతూనే ఉన్నాయి. రిలీజ్ రోజున నెగెటీవ్ టాక్ తెచ్చుకున్నా.. టాక్‌తో సంబంధంలేకుండా కలెక్షన్‌లు వస్తున్నాయి. తొలిరోజు నుండే షారుఖ్ బాక్సాఫీస్‌పై దండయాత్ర కొనసాగిస్తున్నాడు. తొలిరోజే అనుకుంటే రెండు, మూడు ఇలా వరుసగా ఆరురోజులు వంద కోట్లకు తగ్గకుండా కలెక్షన్‌లు సాధిస్తూ బాక్సాఫీస్‌పై విరుచుకుపడుతున్నాడు. ఇక తొలివారం పూర్తయ్యే సరికి రూ.650 కోట్లు కలెక్ట్ చేసి కనివిని ఎరుగని రీతిలో విధ్వంసం సృష్టించాడు. తాజాగా షారుఖ్ మరో అరుదైన రికార్డు సాధించాడు.

శనివారం కలెక్షన్‌లతో పఠాన్ మూవీ 'దంగల్' రికార్డును బ్రేక్ చేసి హిందీలో అత్యధిక కలెక్షన్‌లు సాధించిన మూడో సినిమాగా సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. మొదటి రెండు స్థానాల్లో 'బాహుబలి–2', 'కేజీఎఫ్–2' సినిమాలున్నాయి. ఇక్కడే అనుకుంటే ఓవర్సీస్‌లోనే పఠాన్ వీర విహారం చేస్తున్నాడు. 'ఆర్ఆర్ఆర్', 'బాహుబలి–2' ఫుల్‌రన్‌లను జపాన్, చైనా రిలీజు లేకుండానే అధిగమించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఇదే జోరు కొనసాగితే మరో వారంలో పఠాన్ వెయ్యి కోట్ల మార్కును అందుకోవడం పెద్ద కష్టమేమి కాదు. పైగా నార్త్‌లో అన్ని సెంటర్‌లలో ఇది తప్ప వేరు ఆప్షన్ కూడా లేదు.

పఠాన్ సునామిలో 'గాంధీ గాడ్సే' సినిమా కొట్టుకుపోయింది. ఇక తాజాగా పఠాన్ రూ.300 కోట్ల షేర్‌ని అత్యంత వేగంగా సాధించి 'బాహుబలి–2' రికార్డును బద్దలు కొట్టింది. ఆ ఫీట్‌ను సాధించడానికి బాహుబలి–2కు పది రోజులు పట్టింది. కానీ పఠాన్ కేవలం వారంరోజుల్లోనే ఆ ఫీట్‌ను సాధించింది. ఈ సినిమా రికార్డులతో షారుఖ్ అభిమానులు సంబురాలు చేసుకుంటున్నారు.

# ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు జన్మదిన వేడుకల సందర్భంగా శాలువాతో సత్కరించిన వేములవాడ బార్ అసోసియేషన్ కోశాదికారి తల్లం రాజు

## - ఫిలిగ్రీ పనితనంతో తయారు చేయించి ధైర్యానికి, నిజాయతీకి ప్రతీక అయిన నెమలినీ బహుకరణ



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 4: (నేటినిజం ప్రతినిధి): వేముల వాడ లోని మైత్రి గెస్ట్ హౌస్ లో చెన్నమనేని రమేష్ బాబు పుట్టిన రోజు సందర్భంగా వేములవా డ బార్ అసోసియేషన్ కోశాదికారి తల్లం రాజు , చేన్నమనేని రమేష్ బాబు ను శాలువా తో సత్కరించి, ధైర్యానికి, నిజాయతీకి ప్రతీక అయిన ఫిలిగ్రీ పనితనం తో తయారుచేసిన నెమలి ని అందజేశారు. తదనంతరం తల్లం రాజు మాట్లాడుతూ జనం నచ్చిన నేత, జనం కోసం తపించే నేత, మా చేన్నమనేని రమేష్ బాబు మా ఎమ్మెల్యేగా రావడం ఎంతో అదృష్టమని, జర్మనీ నుండి తెచ్చిన నిధులను, సేవ్స్ సంస్థ స్థాపించి, వాటర్ ప్లాంటు మరియు మురికి కాలువలు ,వాటర్ ట్యాంకులు , నిర్మించి వేములవాడ నియోజకవర్గ ప్రజల గుండెల్లో గూడును కట్టుకున్న మారాజు మా ఎమ్మెల్యే చేన్నమానేని రమేష్ బాబు. వేములవాడ అభివృద్ధి కొరకు కొన్ని కోట్లు తీసుకువచ్చి బద్ది పోచమ్మ ప్రాంగణం మొత్తం దేవల అభివృద్ధి చేస్తున్నారు. వీరి తండ్రిగారైన కీర్తిశేషులు రాజేశ్వరరావు చేసిన సేవలను గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో కిట్టమూర్తి మాధవి సీనియర్ పాత్రికేయులు రాగంపటి హరి, పాత్రికేయులు అబ్దుల్ జబ్బర్ మరియు బ్రాహ్మణ కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు

# మెగాస్టార్‌కు అసలు పరీక్ష భోళా శంకర్ సినిమానే..!




హైదరాబాద్, ఫిబ్రవరి 4: । సెకండ్ ఇన్నింగ్స్‌లో 'ఖైదీనెంబర్ 150' తర్వాత చిరుకు ఆ రేంజ్ హిట్ మొన్నటి వరకు లేదు. ఈ సినిమా తర్వాత వచ్చిన 'సైరా' పక్క రాష్ట్రాల సంగతి పక్కన పెడితే.. తెలుగులో పర్వాలేదనిపించే కలెక్షన్‌లతో లాక్కొచ్చింది. ఇక 'ఆచార్య' గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత బెటర్. కనీసం సినిమా బడ్జెట్‌లో పావు వంతు కలెక్షన్‌లు కూడా రికవరి చేయలేకపోయింది. దసరా కానుకగా విడుదలైన 'గాడ్‌ఫాదర్' కూడా అంతే. తొలి రోజు పాజిటీవ్ టాక్ తెచ్చుకున్నా అప్పటికే ఎంతో మంది చూసేసిన 'లూసీఫర్'కు రీమేక్‌గా రావడంతో ప్రేక్షకులు అంతగా ఆసక్తి కనబరచలేదు. దాంతో ఈ సినిమా కమర్షియల్ ఫేయిల్యూర్‌గా మిగిలింది. ముఖ్యంగా ఆచార్య, గాడ్‌ఫాదర్ ఫలితాలతో చిరు మార్కెట్ చాలా వరకు దెబ్బతింది.

ఇక చిరు కంబ్యాక్ ఇవ్వలేడు. ప్రేక్షకులకు చిరు బోరైపోయాడు. ఇకపై సినిమాలు తీసినా ఇదే పరిస్థితి ఎదురవుతుందంటూ ఎన్నో విమర్శలను చిరు ఎదుర్కొన్నాడు. కట్ చేస్తే వాల్తేరు వీరయ్యతో విమర్శలు చేసిన నోటీతోనే ప్రశంసలు దక్కించుకున్నాడు. వింటేజ్ బాస్ అంటూ ఈలలు వేయించుకున్నాడు. సంక్రాంతి కానుకగా రిలీజైన ఈ సినిమా తొలిరోజు పెద్దగా పాజిటీవ్ టాక్ ఏమి తెచ్చుకోలేదు. కానీ సంక్రాంతికి రిలీజైన సినిమాల్లో ఇదే కాస్త బెటర్‌గా ఉండటంతో ఎక్కడ లేని క్రేజ్ వచ్చింది. పైగా సంక్రాంతి సీజన్ కావడంతో ఫ్యామిలీ ఆడియెన్స్ వాల్తేరు వీరయ్యను చూడడానికి థియేటర్‌లకు ఎగబడ్డారు.

ఐతే ఈ ఒక్క సినిమాతో చిరు సత్తాను అంచనా వేయలేం. చిరు రేంజ్ ఏంటో తెలియాలంటే 'భోళా శంకర్' సినిమానే సరైంది. ఎందుకంటే ఈ సినిమాపై ఇప్పటివరకు ఎలాంటి బజ్ లేదు. పైగా చిత్రబృందం రిలీజ్ చేసిన పోస్టర్‌లు కూడా అంతగా ఆకట్టుకోలేకపోయాయి. ఇవన్నీ పక్కన పెడితే ఈ మధ్య కాలంలో రీమేక్ సినిమాలను ప్రేక్షకులను గాలికి వదిలేస్తున్నారు. అందులోనూ అసలు తెలుగులో హిట్టేలేని మెహర్‌రమేష్ ఈ సినిమా బాధ్యతలు తీసుకోవడంతో మెగా అభిమానులు సైతం భోళాశంకర్‌పై ఇంట్రెస్ట్ చూపడంలేదు. మరి 'వాల్తేరు వీరయ్య'తో గ్రాండ్ కంబ్యాక్ ఇచ్చిన చిరు అదే ఊపుతో భోళా శంకర్‌తో తన స్టైల్ కామెడీ, చరీష్మాతో ఆకట్టుకుంటాడో లేదో చూడాలి. వేసవిలో విడుదలకు ప్లాన్ చేస్తున్న ఈ సినిమా సక్సెస్‌ను బట్టి చిరు రేంజ్ ఏంటో, సినిమాను ఎంతవరకు లాక్కెల్లగలడో తెలుస్తుంది.

# రాయల్టీ స్లిప్పుల నిబంధలను అతిక్రమించవద్దని కోరుతున్న సదరన్ రీజనల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 4: స్టేట్ మైనింగ్ డిపార్ట్‌మెంట్ (రాష్ట్ర గనుల శాఖ) మరియు నేషనల్ హైవేస్ అథారిటీ తప్పనిసరిగా రాయల్టీ స్లిప్స్ అంశంలో అవకతవకలను అరికట్టాలని సదరన్ రీజనల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (ఎస్ఆర్‌సీఏ) కోరింది.

ఈ అసోసియేషన్ ఓ పత్రికా ప్రకటన విడుదల చేస్తూ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) రహదారులు మరియు బ్రిడ్జిల అభివృద్ధి కోసం టెండర్లను అంతర్జాతీయ స్థాయిలో పిలుస్తుంటుంది. టెండర్లు వేసే కంపెనీలు మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులలో ఉపయోగించే కంకర, మట్టి, బ్లూ మెటల్స్ కోసం రాయల్టీ స్లిప్‌లను ఎన్‌హెచ్ఏఐకు అందించాలి అని వెల్లడించింది.

రాష్ట్ర మైనింగ్ శాఖ క్రమంతప్పకుండా గ్రావెల్ సాయిల్, బ్లూ మెటల్స్ నాణ్యతను కాంట్రాక్టర్లకు రాయల్టీ స్లిప్‌లను అందించక మునుపే పరీక్షించాలి. ఉదాహరణకు ఓ 500 కోట్ల రూపాయల ప్రాజెక్ట్‌కు 25 కోట్ల రూపాయల రాయల్టీ సర్టిఫికెట్ అవసరం ఉంటుంది. కానీ కంపెనీలు 5 కోట్ల రూపాయల రాయల్టీ సర్టిఫికెట్ జారీ చేసి, మరో 20 కోట్ల రూపాయల నకిలీ రాయల్టీ సర్టిఫికెట్‌ను స్టేట్ మైనింగ్ డిపార్ట్‌మెంట్ పేరిట సృష్టించి ఎన్‌హెచ్ఏఐకు సమర్పిస్తున్నాయి.

ఈ కారణంగా ప్రభుత్వం కోట్లాది రూపాయల ఆదాయం నష్టపోతుంది. జాతీయ స్థాయిలో, నిబంధనల అతిక్రమణ, ప్రభుత్వానికి ఆదాయ నష్టం, ఈ నకిలీ రాయల్టీ సర్టిఫికెట్ల ద్వారా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్‌లలో అధికంగా జరుగుతుంది.

ఈ అక్రమ కార్యకలాపాల పట్ల చర్యలను తీసుకోవాల్సిందిగా ఎస్ఆర్‌సీఏ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతుంది. ప్రస్తుతం, ఎన్‌హెచ్ఏఐకు సమర్పిస్తున్న రాయల్టీ స్లిప్‌లలో 25% మాత్రమే అసలైనవి. మిగిలినవన్నీ నకిలీ మరియు సృష్టించిన కంపెనీలకు చెందినవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఈ సమస్యను పరిశీలించడంతో పాటుగా ఈ అక్రమాలకు పాల్పడిన కంపెనీలను విచారించాలి. రాష్ట్ర మైనింగ్ శాఖతో పాటుగా నేషనల్ హైవేస్ అథారిటీ తప్పనిసరిగా పర్యవేక్షణ ప్రక్రియ ప్రారంభించాలి. అలాగే రాయల్టీ స్లిప్స్ అంశంలో అవకతవకలను నిరోధించాలి అని ఎస్‌ఆర్‌సీఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తుకుమార్ సూచించారు.






Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail:netinijam93@gmail.com.